# వరద బాధితులు

పాలపర్తి జ్యోతిష్మతి

'అవమ్మో! ఇన్ని డబ్బులెక్కడివండీ?' అడిగింది సుబ్బలక్ష్మి, సుబ్బారావు బీరువాలో దాస్తున్న నోట్ల కట్టలని చూసి.

'ష్ !అరవకే'

'ఇన్ని డబ్బులెక్కడివండీ'? గొంతు తగ్గించి రహస్యంగా అడిగింది.

'ఇవి మన డబ్బులు కావు. మా ఆఫీసు తరపున వరద బాధితుల సహాయార్థం చందాలు సేకరించాం. అవీ ఇవి.'

'వీటితో ఏం చేస్తారు?"

'మొన్న వచ్చిన వరదల్లో ఇళ్ళు మునిగిపోయి సర్వం పోగొట్టుకున్న వాళ్లకి సహాయం చెయ్యడానికి ఉపయోగిస్తాం.'

'అదే, ఎట్లా చేస్తారు? ఏం చేస్తారు? అని అడుగుతున్నాను.'

'బట్టలు కొని ఇస్తాం. పిల్లలకి అవసరమైన పుస్తకాలిస్తాం. డబ్బు సరిపోవడాన్ని బట్టి పళ్లాలు, గ్లాసులు, గిన్నెల్లాంటివి కొని పంచుతాం.'

'డబ్బు రూపంలో కూడా ఇస్తారా?'

'ధన సహాయం ప్రభుత్వం చేస్తుంది. మేమేం ఇవ్వం.'

'ప్రభుత్వం చేసే ధన సహాయం మనదాకా ఎటూ రాదు కానీ వాటిల్లోంచి ఒక వెయ్యి రూపాయలు తీసి దాచిపెట్టండి.'

'ఇప్పుడున్న పరిస్థితుల్లో మనమే వరద బాధితుల సహాయనిధికి డబ్బు పంపించాలి కానీ ప్రభుత్వం ఇచ్చే డబ్బు ఆశించడమేంటి? ఈ డబ్బులోంచి కొంత మనం తీసుకోవడమేంటి? ' అయోమయంగా అడిగాడు సుబ్బారావు.

'మొన్న వరదలు వచ్చినప్పుడు మన ఊళ్ళో కూడా వానలు పడ్డాయి కదా! ఆ వానలకి వరండాలో వేసిన సోఫా తడిసి పాడైపోయింది. అది బాగుచేయించుకోవద్దూ? ప్రభుత్వం ఇచ్చే సహాయం అక్కడెక్కడో వరదల్లో మునిగిపోయిన ఊళ్ళ వాళ్లకి అందుతుంది కానీ మనకి వచ్చిన నష్టానికి ఎవరూ ఏమీ ఇవ్వరు కదా!'

'సోఫా బాగు చేయించుకోడానికి ఈ డబ్బులు తీసుకోవడమేంటి! అర్థం లేకుండా మాట్లాడకు'.

'నేనేం అర్థం లేకుండా మాట్లాడలేదు. మనమూ వరద బాధితులమే కాబట్టి మనమూ కొంత సహాయం పొందుదాం అంటున్నాను.'

'అక్కడ ఊళ్ళకు ఊళ్ళు మునిగిపోయి తిండీ బట్టా లేక జనం అవస్థలు పడుతుంటే నీ సోఫా గోలేంటి? దాన్ని నేను బాగుచేయిస్తాలే. విసిగించక అవతలికెళ్ళు.'

'ఆ రోజు చింటూ వరండాలో కూర్చుని చదువుకుంటూ మంచినీళ్ళు తాగుదామని లేచి లోపలికొచ్చాడు. వాడు బయటకెళ్ళేటప్పటికి ఒక జల్లు వచ్చి పుస్తకాలు తడిసిపోయాయి. 'రాసుకున్న నోట్సు తడిసిపోయింది, ఎట్లా చదువుకోవా'లని వాడెంతబాధపడ్డాడు? ఆ వరద బాధితులకిచ్చే పుస్తకాల్లో నాలుగు నోటు బుక్కులు తీసి వాడికోసం దాచండి.' సుబ్బారావు మాటల్ని పట్టించుకోకుండా అంది సుబ్బలక్ష్మి.

'ఆ తడిసిపోయిన నోట్సు ఆరబెట్టుకుని చదువుకుంటున్నాను. అక్కడక్కడా కాస్త కనిపించని దుంటే ఫ్రెండు దగ్గర చూసి రాసుకున్నాను. నాకే పుస్తకాలూ అక్కర్లేదు. వాటిని చేరవలసిన వాళ్ళకి చేరనియ్యి.' అక్కడే కూర్చుని చదువుకుంటున్న చింటూ తల పైకెత్తి నాలుగు ముక్కలు అనేసి మళ్లీ పుస్తకంలోకి తల దూర్చాడు.

'వెధవా! నేనంటే నీక్కూడా అలుసైపోయింది'. చింటూ మీదికి చెయ్యెత్తింది సుబ్బలక్ష్మి.

'కాస్త కాఫీ ఇస్తావూ! సుబ్బలక్ష్మి చెయ్యి చింటూ మీద పడకుండా అడ్డు వస్తూ అడిగాడు సుబ్బారావు.

'ఆc ! నా మాటలకి పూచిక పుల్లంత విలువివ్వరు కానీ కాఫీలు అందించడానికి మాత్రం పనికొస్తాను.' అసహనంగా గొణుక్కుంటూ లోపలికెళ్లింది సుబ్బలక్ష్మి.

సుబ్బలక్ష్మి కాఫీ తీసుకుని బయటికి వచ్చే టప్పటికి వరండాలో పెద్ద పెద్ద మూటలు కనిపించాయి.

'ఇవేమిటి?'అడిగింది సుబ్బలక్ష్మి.

'వరద బాధితులకి పంచడానికి బట్టలు. రేప్పొద్దున్నే ఇవన్నీ తీసుకుని బయలుదేరి వేళుతున్నాం. అందుకని తెచ్చి ఇక్కడపెట్టారు.'

'కొత్త బట్టలా? లేకపోతే వాళ్ళూ వీళ్ళూ పాతబట్టలు తెచ్చిచ్చారా?'

'అన్ని రకాలూ ఉన్నాయి'

'కొత్తబట్టల మూటేది? పాతబట్టల మూటేది?'

'ఏమో నాకుతెలీదు. అయినా ఆ వివరాలన్నీ నీకెందుకు ?' విసుగ్గా అన్నాడు సుబ్బారావు.

సుబ్బలక్ష్మి కింద కూర్చుని మూటలు విప్పడం మొదలుపెట్టింది.

'అవెందుకు విప్పుతావే ఇప్పుడు? వాటితో నీకేంపని?'

సుబ్బారావుకు సమాధానం చెప్పకుండా మూటల్లోంచి చీరలు బయటికి లాగుతోంది సుబ్బలక్ష్మి.

'అవన్నీ అట్లా కెలుకుతావెందుకే ? మళ్ళీ సర్దుకోవాలంటే అది సామాన్యమైన పనా?' కంగారుగా అన్నాడు సుబ్బారావు.

మూటలోంచి ఒక చీర తీసి పక్కన పెట్టి "ఇది నేను తీసుకుంటున్నాను అంది సుబ్బలక్ష్మి. "ఆ చీరల్లోంచి నువ్వు తీసుకోవడమేంటి!... ఆ చీర నీకు నచ్చితే అట్లాంటిది కొనుక్కుందువుగానిలే. అదక్కడ పెట్టు.'

'కొనుక్కోవడమెందుకు? వరద బాధితులకు పంచే చీరల్లోదే నాకు కావాలి. వరద వచ్చిన రోజు పట్టుచీర కట్టుకుని గుడికెళ్ళాను. ఇంటికి రాగానే చీర తీసి వరండాలో దండెం మీద ఆరేశాను. వానకి తడిసిపోయి, రంగుపోయి పాతగుడ్డలా తయారయింది. పాడైపోయింది పట్టుచీరైనా ఏదో ఒకటిలే అని సరిపెట్టుకుంటున్నాను. ఇది కూడా తీసుకోవద్దంటారేంటి?'

"చిన్న వానకి తడిసిన సోఫాలు, పుస్తకాలు, చీరల స్థానంలో మనం కొత్తవి తీసుకోడానికి కాదు మేం ఈ కార్యక్రమం మొదలుపెట్టింది. వరద వచ్చిన ప్రాంతాల్లో ఇళ్ళల్లోకి నీళ్లూ, బురదా, వచ్చేసి ఒక్క వస్తువు కూడా ఉపయోగించుకోడానికి వీలు లేకుండా పాడైపోయి వాళ్ళంతా బికారులైపోయారు. వాళ్ళకి ఇవ్వాల్సిన వస్తువుల్లో వాటాకి వస్తావేంటి?'

'ఇళ్ళల్లోకి బురద వచ్చేసిందంటే పాపం ఇంట్లో వస్తువు ఒక్కటి కూడా వాళ్ళకి దక్కి ఉండదు కదండీ?'

'అదేగా నేను చెప్పేది.'

'మిగతా వస్తువుల సంగతి సరే. పాపం వెండి బంగారాలు కూడా కొట్టుకుపోయి ఉంటాయి గదండీ?'

'సుబ్బరంగా కొట్టుకుపోయాయి. అందుకే కదా బికారులైపోయారు" అంటోంది.

'మరి వెండి బంగారు వస్తువులు కూడా ఎవరైనా దానం చేస్తున్నారా?'

'అమ్మో! అమ్మకి ఆశ చాలానే ఉంది నాన్నా' అన్నాడు చింటూ.

'ఆశేమిటిరా?' అర్థం కానట్టు అడిగాడు సుబ్బారావు.

'ఆ రోజు అమ్మ 'గుడికెళ్లి వచ్చేటప్పుడు కాలిపట్టా ఒకటి జారి పడిపోయింది. వానొస్తుందేమో ! తొందరగా ఇంటికొచ్చెయ్యాలన్న హడావుడిలో ఎక్కడ పడిపోయిందో గమనించలేదు' అని చెప్పింది కదా? ఇప్పుడు వరద బాధితులకు సహాయం చెయ్యాలని ఎవరైనా వెండి, బంగారు వస్తువులు ఇస్తే వాటిల్లోంచి తనకి కావలసింది తీసుకుందామని అమ్మ ఆలోచన కావచ్చు'.

'ఛ! అదేం కాదురా! వరద ప్రాంతాల్లో ప్రజల పరిస్థితి విని మీ అమ్మ గుండె కరిగిపోయింది. తను కూడా ఏదైనా సహాయం చేద్దాం అనుకుంటోంది. బీరువాలోంచి అమ్మ రవ్వల నెక్లెస్ తీసుకురా. అమ్మ ఇచ్చిన చందాగా రాసుకుందాం. చేసిన దానం పది కాలాల పాటు అందరికీ గుర్తుండిపోతుంది.'

సుబ్బారావు మాటలు పూర్తి కావడం ఆలస్యం ఎక్కుపెట్టి వదిలిన బాణంలా లోపలికి పరుగెత్తాడు చింటూ.

'అమ్మో, నా రవ్వల నెక్లెస్!' గుండెలు బాదుకుంటూ చింటూ వెంటపడింది సుబ్బలక్ష్మి.

# ఎర్రటి నోటి కాకి పిల్లలు

డా॥ మానేపల్లి

ఎంత ఎత్తుగా వుంటుందో అజ్ఞానం
ఒకసారి పిల్లలముందు
పువ్వుల్లాంటి లేత పిందెల్లాంటి
అప్పుడే పుట్టిన కప్పల్లాంటి
కొత్తగా దిగిన సూర్య లేత కిరణంలాంటి
ఎర్రవేప చిగురులాంటి
పిల్లల ఒకసారి ముందు
నిలువుకాళ్ల జీతం-
వేళ్ల చేతికి బొగ్గుముక్కో సుద్దో
ఎంత అద్భుత ప్రపంచం
బొట్టి సెల్లీల్నించి పికాసోల్దాకా
రవివర్మనుంచి అంట్యాకుల పైడిరాజుదాకా
ఆ గీతలచుట్టూ ఎన్నెన్ని కథలు
ఏ మహాసాహిత్యం కూడా మరుగుజ్జు
ఎదుగుతున్నకొద్దీ
మెదడు దుర్వాసన
చేతివేళ్ళు బ్రహ్మజెముళ్లు
చిరుచిరు పద్మపాదాల్ని
బడిలో వేస్తున్నారా
బావిలో తోస్తున్నారా
ఎంత గొప్ప ప్రపంచం కోల్పోతున్నారు
బంగారు గనులు నష్టం
వరాల కోట్లు వ్యర్థం
పిల్లలు మిమ్మల్ని క్షమిస్తున్నారేమోగాని
అజ్ఞానం మూర్ఖం దౌర్జన్యం--
తలలు కాళ్ళలో పాతుకోండి
వానచినుకుల్లా తాజా పిల్లలు
తూనీగల్లాగ సీతాకోక చిలకల్లాగ
గుండెపగిలే పరిమళంతో
కానుగ పువ్వుల్లాగ
ఎర్రనోటి కాకి పిల్లల్లా
పిల్లలు- హరివిల్లులు
రాముడు విరవలేదు
పెద్దలు- వద్దు